# మానవత్వంఖరీదు

ఆ ఆసుపత్రి ధర్మాసుపత్రి, ప్రభుత్వ, ప్రజలకి ఉచితంగా వైద్యం ఏర్పాటు చేసిన ఆసుపత్రి! పేరు చెపితేని కాస్త కూస్తో వున్నవాళ్ళు ''వద్దుబాబూ'' అంటూ దణ్ణం పెట్టే ఆసుపత్రి – లేనివాళ్ళు రోజులతరబడి క్యూలలో నిల్చుని యీ డిపార్టుమెంటు నుంచి ఆ డిపార్టుమెంటుకు పరుగులెత్తి – ప్రాణం పోయేదాకా వైద్యం జరిపించుకోగలమో, లేదోనని సంపేహం కొట్టుమిట్టాడినా గతిలేక వచ్చే ధర్మాసుపత్రి – ఆ హాస్పిటల్లో ఆపరేషన్ థియేటర్ దగ్గర వరండాలో గంటనించి కూర్చున్నాను.

దేముడువరం యిచ్చినా పూజారి వరం యివ్వడన్న సామెతకి అర్థం ఎనస్థీషియన్ కోసం ఎదురుచూస్తూ కూర్చున్న ఆ గంటలో బాగా బోధపడింది. గైనకాలజీ చీఫ్ చూడటం, ఆపరేషన్ డేట్ ఫిక్స్ చేయడం ఒక ఎత్తు – అక్కడి నుంచి బ్లడ్‌టెస్టు, బ్లడ్ గ్రూపింగ్, ఎక్సరే, యూరిన్ టెస్టు – యీ టెస్టులుచే యించుకుని, రూం రిజర్వ్‌చేస్కోడం, ప్రతిడిపార్టుమెంటు చుట్టూ తిరిగి ఈ పనులన్నీపూర్తి చేసుకోవడం మరో ఎత్తు. అఖరుగా ఎనస్థీషియన్ ఓ. కె. చేస్తే గాని ఏఆపరేషన్ చేయరు. ఎంత చీప్ ఆఫ్‌చీప్స్ అయినా ఎనస్థీషియన్ గారు అవుననందే కత్తి పెట్టడానికి వీలులేదు. గవర్నమెంటు ఆస్పత్రిలో – సరే తప్పేదేముంది. ''ఆయన గారు ఆపరేషన్ అయితేగాని బయటకి రారు. థియేటర్లో వున్నారు. అని అక్కడినర్సు చెప్పాక అక్కడ బెంచీమీద చతికిలబడ్డాం.

అరగంట, గంట అయినా ఆయనగారు ఊడిపడలేదు. ఆ గంటనే అరడజను సార్లు ''ఛా–నేరకపోయి ఇక్కడికి వచ్చాం – ఏ ప్రైవేటు నర్సింగ్ హోములోనో చేయించు కోవల్సింది ఈ గొడవలులేకుండా'' అని విసుక్కున్నాను.

మాతమ్ముడు మెడికల్ స్టూడెంటు అవడం,గైనకలజీ ఛీఫ్ వాడికి బాగా తెలియడం. ఆవిడ వజినల్ హిస్ట్రెక్టమీ ప్రవీణురాలవడం "నర్సింగా హోము ఎందుకు దండగ! ఇక్కడ చేసేస్తాను. ఇక్కడయితే స్టాఫ్ వుంటారు. ఎటెన్షన్ వుంటుంది, నాకూ మళ్ళీ చూసేందుకు వీలుంటుంది" అని ఆవిడ అందని, ఓ రెండు మూడు వేలు ఖర్చు తగ్గుతుందని సంతోషించి విక్టోరియా ఆస్పత్రిలో చేయించుకోవడానికి వచ్చాను మా వాడిజేబులో స్టెతస్కోపు వుండటంవల్ల యింకా వేగం వేగం పనులు అవటంవలన ఓ రెండు గంటలలో తెమిలింది వ్యవహారం, అదే మామూలు వాళ్లకయితే గంటల తరబడి క్యూలో నిల్చుని నిల్చుని విసుగెత్తి పోయేది.

ఆ అపరేషన్ ఎప్పటికి అవుతందోనని విసుగ్గా, అలసటగా, చిరాకుగా గోడకి చేరబడి కళ్ళుమూసుకన్నాను. గప్పున ఏదో వాసనకొట్టి, మాటలువిని కళ్ళు తెరిచాను. ఓ ముసలామె. మరో పడుచుమనిషి వచ్చి చెంచీమీద నా పక్కన కూర్చున్నారు. వాళ్ళ పక్కన మరో ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు వచ్చి కూర్చున్నారు. ఆ అవ్వ కట్టుకునన చీర పాతది. మాసిపోయి మరకలతో అసహ్యంగా వుంది. చీరకంపో, వంటికంపో, పొగాకు తమలపాకుల్తో ఎర్రబడ్డ పళ్ళ కంపో-ఏదో వాసన కడుపులో తిప్పింది. "ధర్మాసుపత్రి" బెంచీ నా ఒక్కరిదికాదు. వాళ్లని కూర్చోవద్దనడానికి - పొమ్మనటానకి నాకేం అధికారంలేదు కనుక మనసులో అసహ్యించుకుంటూ ఆ వారకి ఆమెను అంటు కోకుండా జరిగి ముడుచుకుని ఊపిరి బిగబట్టి కూర్చున్నాను - "వెధవసంత నేరకపోయి వచ్చాను" మరోసారి తిట్టుకున్నాను నన్ను నేను-

"డాట్టరు బాబు నేడమ్మా?" ముసలమ్మ పలకరించింది, తల అడ్డంగా ఆడించాను అటు చూడకుండానే. "ఏడబోనాడు" మళ్ళీ ప్రశ్న. "ఆపరేషన్ రూములోవున్నారు. " విసుగ్గా జవాబిచ్చాను మొఖంచిట్లించి. "ఎందోయిడాట రుబాబులు. ఆడకిబో, యీడకిబో అంటూ తరుముతారు. ఒకో డాటరుబాబు అగపడడు. రేపుఅపరేషను చేస్తారంట - ఈ కాగితాలట్టుకు యీడకిబోయి యీడాటరుబాబుకి చూపు అన్నారు" ముసలమ్మ సొదవెళ్ళబోసింది. ఏందమ్మా నీకు అపరేషను చేస్తారా?" యోగక్షేమం విచారించింది. "ఊ" అన్నా ముభావంగా - "ఏంది బడ్డసంచీ అపరేషన్? నా బిడ్డకీ అదేనమ్మా - మూడేళ్ళబట్టీ హైరానా బడ్తంది బిడ్డ - అఖరికి డాటరమ్మ సంచికోసేయాలంది..." ముసలమ్మ ఏదో మాట్లాడుతూనే వుంది. అఖరికి కొన్ని యుగాల అనంతరం అన్నట్టుగా అపరేషన్ థియేటర్‌లోంచి ఎనస్థీషియన్ బైటికి వచ్చారు - రిపోర్టులు చూపి ఓ.కే చేయించుకుని బయటపడ్డాం -

మర్నాడు ఆపరేషన్ - ముందు రాత్రి వచ్చి రూమ్‌లో పడుకోవాలన్నారు. మర్నాటి ఆపరేషన్‌కి సిద్ధం చెయ్యడానికి ఎనిమా, యింజక్షన్‌లు, రెండుజడలు వేసి, వంటినన్ను బంగారమంతా తీయించి ఆసుపత్రి బట్టలు - ఆకుపచ్చ గళ్ళ పొట్టి పరికిణీ తెల్లటి లూజ్ జాకెట్ తొడిగించి బూబమ్మలా తయారుచేసి స్ట్రెచర్ మీద పడుకోబెట్టి ఆపరేషన్ థియేటర్‌కి తీసుకెళ్ళారు. థియేటర్ ముందు గదిలోకి రాగానే ఆ తొడిగిన బట్టలు తీసేసి స్టెరిలైజ్ చేసిన దుస్తులు తొడిగి తలకు గుడ్డకట్టి ఆపరేషన్ టేబిల్ మీద పడుకోబెట్టారు. అంతా సిస్టమేటిక్‌గా ఎవరిపని వారు చేస్తున్నారు. లైటు ఒకడు అమర్చాడు. చేతికి బ్లడ్ ప్రెషర్,రబ్బరు కట్టాడు మరొకరు. బల్లమీద పొజిషన్‌లో పడుకోబెట్టారు ఒకరు. డాక్టర్ గౌను తొడుక్కుంటూ అసిస్టెంట్‌తో ఆపూట మరి ఆరు ఆపరేషన్స్ వున్న వైనం మాట్లాడుతూంది - ఎనస్తీషియన్ ఇంజక్షన్ సిద్ధంచేస్తున్నాడు - చుట్టూకుతూహలంగా చూస్తూ పడు కున్నాను. ఆయన. మా తమ్ముడు బయట వరండాలో వున్నారు. ఆపరేషన్ అయిన తరువాత ఆ రోజంతా ఇన్‌టెన్‌సివ్ కేర్ వార్డులో వుంచుతారు. ఎవరినీ లోపలకి రానివ్వరు. నర్సులే చూస్తారు. ఇన్‌ఫెక్షన్ రాకుండా వుండటంకోసం ఈ జాగ్రత్తలు. మీరు వచ్చి ఏంచేస్తారు అంటూ అమ్మని, అక్కని రావద్దన్నాడు తమ్ముడు. వాడి మెడిసిన్ చదువులంతా మామీదే చూపించి. ''అయ్యో ఎలారా - కాళ్ళు రాయా లన్నా. ఏ అవసరం వచ్చినా ఎవరూ లేనట్టు ఆ ఖర్మ ఎమిటిరా - కాస్త డాక్టరును పెర్మిషన్ అడిగితే లోపలికి వదులుతారేమో'' అంటూ అమ్మ ఆదుర్దా పడుతుంటే నేనే ''ఫరవాలేదమ్మా'' అంటూ నచ్చచెప్పాను. అక్క ''పోనీ నేను వచ్చి వరండాలో కూర్చుంటాను'' అంది. వంటరిగా వుంచడానికి ప్రాణం వప్పక - ఎవరూ అక్కరలేదంటూ తమ్ముడు. ఆయన మాత్రం వచ్చారు వెంట.

ఎనస్తీషియన్ డాక్టరు డ్రస్సింగ్ పూర్తవడం చూసి రెడీ అంటూ నరంకేసి యింజక్షన్ చేశాడు - అంతే.. చటుక్కున వున్నట్లుండి అగాధం... ఏదో చీకట్లోకి జారిపోయాను --- కాసేపటికి ఎవరో అగాధంలోంచి పైకి నెమ్మదిగా లేవనెత్తారు. దేనిమీదో పడుకోబెట్టి తీసుకెళ్ళారు. మళ్ళీ లేవనెత్తి మెత్తటి దాని మీద పడుకోబెట్టారు - ఏవో మాటలు విని పిస్తున్నాయి - బలవంతంగా కళ్ళిప్పాను- మసగ్గా మంచుతెర అడ్డువచ్చినట్టు మనుష్యులు కనపడ్డారు-తెలివి వస్తూంది-మళ్ళీ కళ్ళు మూసుకుపోతున్నాయి - మరోసారి కళ్ళిప్పేసరికి వార్డులో పక్కమీద వున్నట్టు తెల్సింది. ఎదురుగా డాక్టరు. ఆయన, తమ్ముడు కనిపించారు - ''యుటిరస్‌తో పాటు ఓవరీస్‌కూడా తీసేసానండి. ఎడంవైపు ఓవరీ గట్టిపడింది. కుడివైపు ఓవరీ మీద ఏదో మౌల్డ్ తయారయింది. యిప్పుడు తీయకపోతే మరోసారి ఆపరేషన్

చేసి ఓవరీస్ తీసేయాలి ఎలాగో అని యిప్పుడే తీసేసాను - అంటూ డాక్టరు ఓనర్సు చేతిలో చిన్న బేసిన్‌లో పెట్టిన ఎర్రని మాంసం ముద్దలా వున్న యుటెరెస్ చూపిస్తూ చెపుతూంది - నేను కళ్ళుతెరవడం చూసి డాక్టర్ నవ్వి దగ్గరకివచ్చి పల్సు చూసి తలాడించి వెళ్ళిపోయింది - నడుంలో పురిటినొప్పుల్లా ఒకటే నొప్పి! కాళ్ళు పీక్కుపోతున్నాయి --- నడుంలో నరాలు మెలితిప్పినట్లు పోట్లు - నొప్పికి "అమ్మా - అమ్మా" అంటూ బాధతో యిటు అటు పొర్ల సాగాను - "మర్దలోగే యహారహనామానా హై - అప్ బహార్ బైఠియే" అంటూంది నర్సు మా వాళ్ళతో. ఎవరైనా ఆడవాళ్ళని కావలిస్తే వుండమనండి మీరు వెళ్ళండి - మా వాళ్ళని తరిమింది బయటికి - "అయ్యో - మీ అమ్మగారినో, అక్కనో తీసుకురావల్సింది. వద్దన్నావు అనవసరంగా-" అంటున్నారు ఆయన. మా వాడితో. "నర్స్ - యిప్పుడే మా ఆడవాళ్ళని తీసుకొస్తాం - ఈ లోగా కాస్త చూడండి -" అంటూ తమ్ముడు గబగబ వెళ్ళాడు -" "బైట ఉంటానుఏమయినా కావలిస్తే పిలవండి" అంటూ ఆయన వెళ్ళారు.

మత్తు ప్రభావం తగ్గుతున్న కొద్దీ నొప్పి ఎక్కువ తెలుస్తూంది. నడుంపోటు భరించడం కష్టమై యిటు అటు పొర్లుతున్నను - "అమ్మా నొప్పి... బాబోయ్ ... కాళ్ళు పీకుతున్నాయి-"అంటూ చిన్న పిల్లలా తల తిప్పుతూ ఏమిటేమిటూ అరుస్తున్నాను. బాధకి తోడు చేతికి గ్లూకోజ్ డ్రిప్ పెట్టిన బాధ - చేయికదపటానికి లేదు-వాటికి తోడు కడుపులో తిప్పటం ఆరంభించి వికారంగా వాంతి వచ్చేట్లుంది - దగ్గర నా అన్నవాళ్ళు లేని లోటు ఎలాంటిదో అర్థమై "అమ్మా.. నొప్పి... బాబోయ్ భరించలేను..." మూలుగుతున్నాను -

ఆపరేషన్ అయిన వాళ్ళని ఒకొక్కళ్ళని తీసుకొచ్చి బెడ్ మీద పడుకోబెట్టి గ్లూకోజ్ డ్రిప్ పడుతున్నారు - నర్సులు, వార్డ్‌బాయిస్, ఎవరికాళ్ళదగ్గర వాళ్ళ ఆడవారిని వుండనిస్తున్నారు - మాతమ్ముడి ధర్మమా అని దగ్గర ఎవరూ లేకుండా అయ్యిను ఎవరి గొడవలో హడావిడిగా వారున్నారు నర్సులు రోజూ చూసే తతంగమే కనుక నా కేకలు, మూలుగులు పట్టించుకోనేలేదు.

భాధకి స్థిరంగా వుండలేక పొర్లుతున్నాను-"అయ్యొయ్యో - బిడ్డా, అట్టా కదలమాకు - యిప్పుడే అపరేషన్ సేసినారు.. ఏటమ్మా నీవాళ్ళు ఎవరూ నేరు....? అయ్యో బిడ్డ మెలితిరిగిపోతంది..." అంటూ చటుక్కునవచ్చి ఓ ముసలామె కదలనీకుండా కాళ్ళు పట్టుకుంది... కడుపులో వికారం హెచ్చింది. "అమ్మా - వాంతి, అంటూ లేవబోయాను. కదలడంతో చేతికున్న గ్లూకోజ్ డ్రిప్ సూది వచ్చేసి

చేతినించి రక్త కారడం మొదలు పెట్టింది - ''అయ్యొయ్యో - నర్సమ్మా - యీయమ్మ సూడు లేచిపోనాది...'' అంటూ కేకలుపెట్టి చటుక్కున వచ్చి'' ''అయ్యో...'' అంటూ పట్టుకుని తలఒడిలో పెట్టుకుంది. భళ్లున ఆమె ఒళ్ళో వాంతి చేశాను. ఈ లోగా నర్సువచ్చి - డ్రిప్ పెట్టిన సూది మళ్ళీ నరంలోకి గుచ్చి ''ఏమిటలా కదులుతున్నారు. డ్రిప్ వచ్చేస్తుంది. కదలకుండా పడుకోండి'' కసిరినట్టే అంది. ''నొప్పి... వికారంగావుంది. కాళ్ళు లాగేస్తున్నాయి'' చిన్నపిల్ల తల్లితో చెప్పుకున్నట్టు నర్సుతో చెప్పుకున్నాను - ''బాగుంది. అపరేషన్ అయి గంటయింది. నొప్పివుండదా - ఈ రోజంతా వుటుంది మరి-'' అంటూ వెళ్ళిపోయింది నర్సు -

''అదేటి! నీవోళ్ళుఎవరూ నేరువొంటిగా వదిలిపోనారా.. అయ్యో బిడ్డా యిటుసూడు. యింకా వికారంగావుందా? అయమ్మా! యీ అమ్మ వాంతి సేస్తందట బేసినట్టుకురా... అయ్యో సేయంత రగతం! తుడండమ్మానరసమ్మ - కుట్లు వేసినారేమో కదలమాకుతల్లీ... నడుంపీకుతందా!రాయునా అమ్మా.. కాల్లు నొప్పా... '' అంటూనెమ్మదిగా నడుంరాస్తూ కాళ్ళు వత్తుతూ అంటూంది ముసలమ్మ. వాంతిఅయి కాస్త కడుపులో వికారం తగ్గి. ఆ ముసలమ్మ నడుంరాస్తుంటే - అమ్మచేతితో రాస్తున్నట్టు హాయిగా కాస్త ఉపశాంతిగా వుంది. అముసలమ్మ ఎరిగిన మొహంలావుంది ఎక్కడ చూశాను. కళ్ళుమూసికొనే ఆలోచిస్తున్నాను అంతబాధలోనూ - చటుక్కున నిన్న ఎనస్తీషియన్ కోసం ఎదురుచూస్తూండగా నాప్రక్కన బెంచీమీద కూర్చున్న అవ్వ గుర్తువచ్చింది - ఆమే! కంపు, వాసన అని ఏహ్యించుకున్న ఆమె వడిలోనే తలపెట్టుకుని ఇవ్వాళ పడుకున్నాను - నేను అసహ్యించుకున్న ఆ నల్లటిగోళ్ళు, బీటలు వేసిన చేతులే నన్ను సేదదీరుస్తూ నడుం పడుతున్నాయి. వెధవ సంత అని అనుకున్న నాకు ఆమె ఆసమయంలో అప్పురాలై తోడూనీడ అయినిల్చింది. అమెను గుర్తుపట్టిన క్షణంలో సిగ్గు, ఏదోబాధ - పశ్చాత్తాపమో, పరివర్తనో కృతజ్ఞతో, ఏదో తెలియని భావానికి లోనయి ఆమె మొహంలోకి చూడలేక పోయాను. అయ్యా.. చీరమీద వాంతి చేశాను.'' అన్నాను సిగ్గుపడుతూ - ''పరలేదులే బిడ్డా - నల్లాకాడ సఫా సేస్కుంటే పోతాంది. నీవోల్లురానీ ఎల్లి సఫా సేస్కుంటా'' - అంటూ కాలు వత్తింది,

''అయ్యో వద్దు-'' అన్నాను మొహమాటంగా కాలు లాక్కుంటూ- ''అయ్యో అట్టి కాలు గుంజమాకు - కుట్లుకుట్టినారేమో - కష్టంలో జరా ఒకరికి ఒకరు తోడుండాలే - అంది.

ఆ మాటలకి సిగ్గుపడ్డా - మొహంచూడలేక పక్కకి తిరగబోతుంటే కాళ్ళు గట్టిగా పట్టి ''తిరుగమోకు, కుట్లు విడినాయంటే మళ్ళీ గడబిడ...''

''కుట్లు వేయలేదులే - పొట్టకోసి అపరేషన్ చేయలేదు, లోపలనించి తీసేసారు -'' అన్నాను...''

''మీ పిల్ల ఏది? అపరేషన్ అవలేదా - ''

''లేదు సేస్తండరు - '' అంది.

అంతలో ఆ వూర్లోవున్న తోడికోడలు ''అయ్యో - అదేంటి అక్కయ్యగారూ ఒక్కరేవున్నారు - ఎవరూ లేరేం'' అంటూ వచ్చింది. ఈలోగా అవ్వ కుతుర్ని స్ట్రెచ్చర్‌మీద తీసుకువస్తుంటే అవ్వలేచి ''బిడ్డని సూస్కో అమ్మా ఒక్కట్టే బాధ పడ్తంది-'' అంటూ తోడికోడలికి అప్పగించి వెళ్లింది. మరో పావు గంటలో అక్క వచ్చింది. ఆ గంటలో నా అన్నవాళ్ళు లేనిబాధ ఎలాంటిదో తెల్సింది. ఆ బాధ తెలీకుండా ఆ అవ్వ సాయపడిన తీరుకి, ముందురోజు నేను అవ్వని అసహ్యించుకున్నతీరుని పోల్చుకుని సిగ్గుపడ్డాను. అవ్వ కూతురే అలా నా స్థితిలోవుంటే తనలా ముందుకు వచ్చిసాయపడతానా - వూహు - చచ్చినా తాకనుకూడతాకను. తాకలేను.

మర్నాడు ఉదయం వరకు ఇన్‌టెన్సివ్ కేర్ వార్డ్‌లో వుంచేశారు. ఆ ఉదయం డాక్టరు వచ్చి చూశాక రూముకి తీసుకెళ్ళమన్నారు. స్ట్రెచ్చర్ మీద పడుకోబెట్టి తీసికెడుతూంటే. కూతురి మంచం దగ్గర కూర్చుని అవ్వ నవ్వుతూ: ''కులాసానా బిడ్డా - నిన్న అంత గడబిడచేసావు-'' అంటూ పలకరించింది.

''అక్కా - నీ పర్సులో డబ్బేమన్నా వుందా - '' అన్నాను వెంటవస్తున్న అక్కతో.

''ఆ - పదిహేనో, ఇవవయ్యో వుంది. ఆయాకి, వార్డు బాయ్‌కి యిచ్చాలే - అంది.

''ఆ యిరవై యిలా యియ్యి'' - అంటూ పుచ్చుకుని అవ్వ చేతిలో పెట్టి'' నీ కూతురికి పళ్ళుకొని యియ్యి అవ్వా'' అన్నాను. అవ్వ సంతోషంగా దణ్ణంపెట్టింది.

ఆ క్షణంలో అవ్వ మానవత్వానికి నేకట్టగలిగిన విలువ - నే చూపగలిగిన కృతజ్ఞత అంతే!

(వనితాజ్యోతి - జూన్ 1978)